అక్షర దర్బార్
వెల ₹5
www.aksharadarbar.com
voice of the people
సోమవారం 18, నవంబర్ 2024 | సంపుటి :02 | సంచిక :242 | పేజీలు :05

మానుకోటకు కేటీఆర్ !

- 21న జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ మహాధర్నా
- హుజురుకానున్న వర్కింగ్ ప్రసిడెంట్ !

05

విజయోత్సవ సభకు వేళాయె..

- రేపు నగరానికి సీఎం రేవంత్‌రెడ్డి
- వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ముఖ్యమంత్రి పర్యటన
- శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలతో బిజీబిజీ..
- ఆర్ట్స్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ
- తరలిరానున్న మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- సీఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

04

కల నెరవేరింది..

- ఓరుగల్లుపై కాంగ్రెస్ సర్కార్ వరాల జల్లు..
- దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు మోక్షం

02

ఓరుగల్లుపై కాంగ్రెస్ సర్కార్ వరాల జల్లు కురిపిస్తోంది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం చూపుతోంది. తెలంగాణలో ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా రేపు హన్మకొండలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తోంది. ఈసభకు ఒక్కరోజు ముందే నగర అభివృద్ధి కోసం వందల కోట్లు మంజూరు చేసింది. ఓరుగల్లువాసుల చిరకాల కోరికలైన మామునూర్ ఎయిర్‌పోర్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టం, కుడా మాస్టర్ ప్లాన్ కు నిధుల వరద పారించింది. వరంగల్ భూగర్భ డ్రైనేజీ పథకానికి ప్రభుత్వం రూ.4170 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టు భూసేకరణకు రూ. 205 కోట్లు.. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు భూములిచ్చిన రైతులకు 863 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసింది. కేఎంటీపీ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది. 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా వీటితోపాటు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనుండటంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. రెండో రాజధానిగా ఓరుగల్లును అభివృద్ధి చేస్తామన్న హామీలను ఆచరణలో పెడుతూ ప్రభుత్వం అడుగులు వేస్తుండటంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

- అభివృద్ధికి కనీవినీ ఎరుగని రీతిలో రూ.వందల కోట్ల కేటాయింపు
- కుడా మాస్టర్ ప్లాన్, మామునూర్ ఎయిర్‌పోర్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి లైన్ క్లియర్
- ఆధునాతన హంగులు సంతరించుకోనున్నత్రి నగరి
- మారనున్న చారిత్రక నగరి రూపురేఖలు
- సెకండ్ క్యాపిటల్ హామీ దిశగా అడుగులు
- హర్షం వ్యక్తంచేస్తున్న ఓరుగల్లు వాసులు

పరిగి డీఎస్పీపై బదిలీ వేటు

- కరుణాకర్‌రెడ్డిని డీజీపీ ఆఫీస్‌కి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు
- లగచర్ల ఘటన నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు

04

రోడ్డుపైనే మార్కెట్!!

- నిర్వీర్యమైన కూరగాయల మార్కెట్
- గిరాకి లేకుండా ఇబ్బందులు పడుతున్న వైనం
- రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ విక్రయాలు
- స్థలం లేదంటూ అధికారుల బుకాయింపు
- సెంటర్లోనే నాన్‌వెజ్ దుకాణాలు
- కుక్కల స్వైర విహారం
- సబ్‌డివిజన్ కేంద్రంలో వింత ఆచారం

03

బూడిద లొల్లి!

- కేటీపీపీ వద్ద బాటమ్ యాష్ తరలింపుపై వివాదం
- అసోసియేషన్ గా ఏర్పడిన లోకల్ లారీల ఓనర్లు

05

- వరంగల్ ప్రాంతంలోని ఇటుక బట్టీలకు బాటమ్ యాష్ రవాణా
- వరంగల్ కు చెందిన లారీల్లో బాటమ్ యాష్ లోడింగ్ కు అభ్యంతరం
- లోకల్, నాన్ లోకల్ లారీల ఓనర్ల మధ్య పంచాయతీ
- పరిష్కారానికి రంగంలోకి దిగిన రెండు జిల్లాల పోలీస్ అధికారులు

కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటిపీపీ) నుంచి వెలువడుతున్న బూడిద లోడింగ్, రవాణాలో ఇటీవలి కాలంగా వివాదం చోటు చేసుకుంటుంది. ప్రధానంగా బూడిద రవాణాలో లారీల ఓనర్ల మధ్య లోకల్, నాన్ లోకల్ అనే పంచాయతీ తలెత్తుతుంది. ప్రస్తుతం ప్లై యాష్, బాటమ్ యాష్ లోడింగ్, రవాణాపై కొద్ది రోజుల నుంచి వివాదం నడుస్తుండటం చర్చనీయాంశమైంది. తాజాగా బాటమ్ యాష్ లోడింగ్, రవాణాపై లారీల ఓనర్ల నడుమ ఏర్పడిన లొల్లి పోలీసుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. - అక్షరదర్బార్, చెల్పూర్

కల నెరవేరింది..

ఓరుగల్లుపై కాంగ్రెస్ సర్కార్ వరాల జల్లు..

అక్షర దర్బార్, ప్రత్యేక ప్రతినిధి:

ఓరుగల్లుపై కాంగ్రెస్ సర్కార్ వరాల జల్లు కురిపిస్తోంది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం చూపుతోంది. తెలంగాణలో ప్రభుత్వం కొలువుదీరి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా రేపు హన్మకొండలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తోంది. ఈసభకు ఒక్కరోజు ముందే నగర అభివృద్ధి కోసం వందల కోట్లు మంజూరు చేసింది. ఓరుగల్లువాసుల చిరకాల కోరికలైన మామునూర్ ఎయిర్‌పోర్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిస్టం, కుడా మాస్టర్ ప్లాన్ కు నిధుల వరద పారించింది. వరంగల్ భూగర్జ డ్రైనేజీ పథకానికి ప్రభుత్వం రూ. 4170 కోట్లు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టు భూ సేకరణకు రూ. 205 కోట్లు.. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు భూములిచ్చిన రైతులకు 863 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసింది. కేఎంటీపీ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపింది. 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా వీటితోపాటు పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనుండటంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. రెండో రాజధానిగా ఓరుగల్లును అభివృద్ధి చేస్తామన్న హామీలను ఆచరణలో పెడుతూ ప్రభుత్వం అడుగులు వేస్తుండటంతో జిల్లావాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ. 4170 కోట్లు..

వరంగల్ వాసుల చిరకాల వాంఛ భూగర్జ డ్రైనేజీ పథక◌ానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ మేరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ స్కీంకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది. ఈ పథకం అమలుకు రూ. 4170 కోట్లు మంజూరు చేస్తూ సోమవారం జీవో విడుదల చేసింది. మొత్తం మూడు దశల్లో చేపట్టనున్న పనులను రేపు సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు.

ఎయిర్ పోర్టుకు రూ. 205 కోట్లు..

కేంద్ర ప్రభుత్వ ఉడాన్ పథకంలో భాగంగా రాష్ట్రంలో చేపట్టనున్న మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల ప్రత్యేక చొరవతో వరంగల్ వాసుల గగనయాన యాత్ర కల నెరవేరబోతోంది. ఈ ఎయిర్‌పోర్టు ప్రతిపాదనకు గ్రీన్ సిగ్న ల్ లభించింది. ఎయిర్‌పోర్టు విస్తరణకు అవసరమైన 280.30 ఎకరాల భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు అవసరమైన నిధులు విడుదల చేయడంతోపాటు త్వరగా భూసేకరణ పూర్తిచే యాలని వరంగల్ కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో మామునూర్ విమానాశ్రయం పనులు ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే మామునూర్ ఎయిర్ పోర్ట్ కు 686

- దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు మోక్షం
- అభివృద్ధికి కనీవినీ ఎరుగని రీతిలో రూ.వందల కోట్ల కేటాయింపు
- కుడా మాస్టర్ ప్లాన్, మామునూర్ ఎయిర్‌పోర్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి లైన్ క్లియర్
- అధునాతన హంగులు సంతరించుకోనున్న త్రినగరి
- మారనున్న చారిత్రక నగరి రూపురేఖలు
- సెకండ్ క్యాపిటల్ హామీ దిశగా అడుగులు
- హర్షం వ్యక్తంచేస్తున్న ఓరుగల్లు వాసులు

ఎకరాల భూమి ఉన్న విషయం తెలిసిందే.

- ఐఆర్‌ఆర్ కు రూ.80 కోట్లు ..

వరంగల్ నగరంలో ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్‌ఆర్) నిర్మించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉంది. ఈమేరకు వరంగల్ –ఖమ్మం రోడ్డులోని ఆర్టీవో జంక్షన్ నుంచి గొర్రెకుంట మీదుగా ఏనుమాముల వరకు ఐఆర్‌ఆర్ నిర్మాణం కోసం గతంలోనే కాకతీయ అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (కుడా) ప్రతిపాదనలు తయారు చేసింది. కొన్ని కారణాల వల్ల ఈ ఐఆర్‌ఆర్ నిర్మాణం ముందుకు సాగలేదు. తాజాగా ఐఆర్‌ఆర్ 163 జాతీయ రహదారికి కలిసేలా ఆరేపల్లి వరకు పొడిగిస్తూ రూ.50 కోట్లు అంచనాలను రూ.80 కోట్లకు పెంచింది. ఈ మేరకు ఆదివారం రూ.30 కోట్లు కలిపి రూ.80 కోట్లతో ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. దీంతో ఐఆర్‌ఆర్ నిర్మాణానికి అడ్డంకి ఉన్న సమస్యలు తొలగిపోనున్నాయని, ఐఆర్‌ఆర్ నిర్మాణం జరగనుందని ఓరుగల్లు వాసులు ఆశిస్తున్నారు.

- 863 మంది రైతులకు ఇండ్ల పట్టాలు..

గత జూన్ 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ సందర్శించారు. ఈ సందర్భంగా పార్కుకు భూములు ఇచ్చిన రైతులను ఆదుకోవాలని, ఇంటి స్థలం ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సీఎంను కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన సీఎం .. భూములు కోల్పోయిన రైతులందరికీ ఒకే చోట నివేశన స్థలాలను కేటాయించి లేఅవుట్ తో టౌన్ షిప్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కు ఆవరణలో భూ నిర్వాసితులకు అందరికీ ఒకే చోట లేఅవుట్ సిద్ధం చేసిన అధికారులు మౌలిక వసతులను సమకూర్చారు. ఇందులో భూనిర్వాసితులకు 863 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ రాష్ట్రప్రభుత్వం రెండు రోజుల కింద ఉత్వర్వులు జారీ చేసింది. 19న ముఖ్యమంత్రి చేతుల మీదుగా తమకు ఇండ్ల పట్టాలు అందించనుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- మున్సిపల్ టవర్ల కోసం రూ.32.5 కోట్లు ..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ బిల్డింగ్ కొన్నేళ్ల కిందట నిర్మించగా.. ఇప్పుడది శిథిలావస్థకు చేరింది. అక్కడి ఇండోర్ స్టేడియం ఎదుట కొత్త బిల్డింగ్ నిర్మించేందుకు గతంలో ప్రపోజల్స్ పెట్టారు. రేవంత్ రెడ్డి సర్కారు జీడబ్ల్యూఎంసీ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ కోసం రూ.32.5 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ బిల్డింగ్‌ను మొత్తంగా ఐదు అంతస్తుల్లో.. ఆధునిక హంగులతో నిర్మించేందుకు ప్లాన్ రెడీ చేశారు.

- ముంపు నివారణకు..

వరంగల్ జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కుకు సమీపంలోని నాలాతో ముంపు ముప్పు పొంచి ఉంది. ఈ మేరకు గత జూన్‌లో వరంగల్ నగరానికి వచ్చిన సందర్భంగా.. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కుకు ముంపు సమస్య లేకుండా చేస్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే నాలా రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి మొత్తంగా రూ.160 కోట్లు మంజూరు చేశారు. కేవలం రిటైనింగ్ వాల్స్ నిర్మాణానికి రూ.132.28 కోట్లు ఖర్చు పెట్టనుండగా.. ఇతర ఫినిషింగ్ పనులకు రూ.4.13 కోట్లు ఖర్చవనున్నాయి. మరో రూ.24.54 కోట్లు కేవలం జీఎస్టీకే అవుతుండటం గమనార్హం. తొందర్లోనే ఈ పనులు స్టార్ట్ కానుండగా.. వరంగల్ కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్కుకు ముంపు ముప్పు తప్పింది.

- మారుతున్న రూపురేఖలు..

వరంగల్ నగరంలో ఇప్పటికే వివిధ అభివృద్ధి పనులకు అడుగులు పడ్డాయి. ముఖ్యంగా వరంగల్– కరీంనగర్ హైవే పై ఉన్న నయీంనగర్ నాలాతో దాదాపు 20 కిపైగా కాలనీలు ముంపునకు గురవుతుండగా.. సుమారు రూ.100 కోట్లతో నయీంనగర్ నాలా పనులు పూర్తయ్యాయి. ఆ ఏరియా రూపు రేఖలే మారిపోయాయి. హనుమకొండ బాలసముద్రంలో దాదాపు రూ.95 కోట్లతో కాళోజీ కళాక్షేత్రం కూడా ఓపెనింగ్‌కు రెడీ అయ్యింది. ఆ ఏరియా కూడా కొత్త కళను సంతరించుకుంది.

- సెకండ్ క్యాపిటల్ వైపు అడుగులు..

వరంగల్ భద్రకాళీ ఆలయం చుట్టూ మాఢ వీధుల నిర్మాణంతో పాటు భద్రకాళి చెరువును కూడా డెవలప్ చేసే పనులు కొనసాగుతున్నాయి. తొందర్లోనే వరంగల్ లోని బొందివాగు నాలా పనులు కూడా ప్రారంభం కానున్నాయి. వీటితో పాటు 19న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరా మహిళా శక్తి భవనాలకు శిలాఫలకం వేయనున్నారు. ఇవన్నీ పనులు పూర్తయితే వరంగల్ నగరం కొత్త కళను సంతరించుకునే ఛాన్స్ ఉంది. హైదరాబాద్ తర్వాత అదే స్థాయిలో డెవలప్ చేస్తామని రేవంత్ రెడ్డి, మంత్రులు, స్థానిక నేతలు చెబుతుండగా.. ఓరుగల్లు రాష్ట్ర రెండో రాజధానిగా అవతరిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యేదెప్పుడో?

- నిద్రమత్తులో ఐటీడీఏ, ఆర్అండ్ బీ అధికారులు..
- కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయినట్లేనా..?
- పనులపై అధికారులకు పట్టింపేది..?
- స్థానిక ఎమ్మెల్యే స్పందించాలంటూ ప్రజల వేడుకలు..

అక్షర దర్బార్, కేసముద్రం : ప్రజల ప్రాణాలంటే అధికారులకు లెక్క లేదా..? అసంపూర్తిగా ఉన్న రోడ్లను ఎప్పుడు పూర్తి చేస్తారో..? పలు కథనాలు వస్తున్న సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎన్నికల ముందు గత ప్రభుత్వం చేసిన ఆర్భాటాలు.. చూస్తే.. ముక్కున వేలేసుకునే పరిస్థితి ఔరా అనుకోవాల్సిందే.హాడావుడిగా.. ఉరికి ఉరికి వేసిన అడుగులు.. ఆకరికి అడ్డం పడేసాయి అన్నట్టు... గత బీఆర్ఎస్ పార్టీ పదవి దిగే ముందు చేసిన ఆర్భాటం కూడా అచ్చం అట్లాంటిదేనని చెప్పవచ్చు.మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో మాజీ ఎమ్మెల్యే చేసిన పనులు చూసి బిత్తరపోవాల్సిందేనా... ? అనే రీతిగా ఎన్నికల ముందు ప్రజలను మాయ చేసేందుకు... అభివృద్ధికి మారు పేరు మేమే అన్న పేరు ప్రఖ్యాతలు తెచ్చుకునేందుకు.. చిట్టచివరణ తహతహలాడారు అనడానికి అచ్చం తార్కానం కేసముద్రంలో స్థాపించిన శిలా ఫలాకాలే అందుకు నిదర్శమని చెప్తాయి. గత ప్రభుత్వ హయాంలో... సుమారు 40 కోట్ల మేర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్ట్ దక్కించుకున్న మండల కేంద్రానికి చెందిన ఓ బీఆర్ఎస్ లీడర్ వాటిని ఆర్భాటంగా శిలాఫలాకాలు వేసారు. రేపు, ఎల్లుండి.. అంటూ శంకుస్థాపనలు చేసి వదిలేశారు. శంకుస్థాపనలు చేసిన శిలాఫలకాలు కూలిపోయే పరిస్తితి వచ్చింది కానీ.. రోడ్ల నిర్మాణాలు మాత్రం పూర్తి కాలేదు.. గ్రావెల్ వేసి.. కంకర పోసి నేర్పించడంతోనే సరిపెట్టారు.. కానీ కాంక్రీట్ వేసి.. రోడ్డు వేయడం,తారు రోడ్డు నిర్మాణం చేయడాలు జరగలేదు.కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా.. ? లేక గత ప్రభుత్వ వైఫల్యామా లేదా ప్రజల ప్రాణాలంటే లెక్క లేదా అనే ప్రశ్నలు ప్రజలలో లేవనెత్తుతున్నాయి.ఉన్నతాధికారులు.. ఎందుకు ఈ అభివృద్ధి పనులపై శ్రద్ద చూపడం లేదు అనేది విస్మయాన్ని కలిగిస్తుంది.ఇక చేసిన అడపా తడపా పనుల వల్ల.. ప్రయాణికులు.. ఆయా ప్రాంతాల్లో ప్రయాణాలు చేయాలంటే.. నరకాన్ని అనుభవిస్తున్నారు.రాత్రి సమయంలో.. మాత్రం.. అనేక మంది ప్రయాణికులు ఆ మార్గాల గుండా ప్రయాణించినప్పుడు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు.కంకర ఉన్న కారణంగా.. తీవ్రంగా గాయాల పాలై.. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.దీంతో.. గత ప్రభుత్వం.. ఆర్భాటాలకు,ఆడంబరాలకు పోయి.. నేడు సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని పలువురు రాజకీయ నేతలు అంటున్నారు.ఐటీడీఏ నిధులు,ఆర్అండ్బి నిధులు,పంచాయతీ రాజ్ నిధులు పూర్తి స్థాయిలో వినియోగించడంలో నాటి పాలకులు.. అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శిస్తున్నారు.కంకర పోసి రోడ్డును వేయడం మరిచారంటూ స్థానికులు ఎద్దేవా చేస్తున్నారు.రోడ్ల నిర్మాణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ పై అధికారులు చర్యలు తీసుకోకపోవడం వలనే పనులలో జాప్యం జరుగుతుందంటూ పలువురు విమర్శిస్తున్నారు.నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు రోడ్డును నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలి,కానీ అందుకు విరుద్ధంగా కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి మరో రెండు పర్యాయాలైన రోడ్లు పూర్తవ్వవేమో అని అయోమయంలో జనాలు ఉన్నారని మేధావులు అంటున్న మాట.కేసముద్రం మండలానికి చెందిన డబ్బు పలుకుబడి కలిగిన కొంతమంది బిఆర్ఎస్ నాయకులు మాజీ మండల ప్రజాప్రతినిధులు అప్పటి ఎమ్మెల్యే వద్ద కాంట్రాక్ట్ పనులను దక్కించుకొని మరల బిఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్న భ్రమలో తమను అడిగేవారు లేరనే రీతిలో కాంట్రాక్టర్లు వ్యవహరించిన తీరును చూస్తే ముక్కున వేలేసుకొని పక్కున నవ్వాల్సిందే.అసంపూర్తిగా నిర్మించిన రోడ్లతో ప్రజలు నానా అవస్థలు పడుతూ నరకం చూస్తున్నారు. మార్పు రావాలంటూ ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్న ప్రజలకు ప్రస్తుత ప్రభుత్వం రోడ్ల నిర్మాణాలపై చర్యలు తీసుకుంటుందా అనేది ఇప్పుడు మండలంలో హాట్ టాపిక్ గా మారింది.మరి ఇప్పటికైనా.. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్.. శ్రద్ధ చూపి..కేసముద్రం మండలంలోని రోడ్డు నిర్మాణ పెండింగ్ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు,ప్రయాణికులు కోరుతున్నారు.ఎక్కడ పనులు ఆగిపోయాయో ఆరా తీసి.. తక్షణమే చర్యలు తీసుకోని... మరిన్ని ప్రమాదాలు జరిగకుండ అరికట్టేలా అధికారులను ఆదేశించేలా చూడాలంటున్నారు. పనులను పూర్తి చేయని కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకుని కొత్త టెండర్లను పిలిచి రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అధికారులను వారిస్తారా లేదో వేచి చూడాల్సిందే మరి..

కంకర పోసి రెండేళ్లవుతోంది..

- మంద శశికుమార్, బీఎస్ యూ రాష్ట్ర కన్వీనర్

రెండేళ్ల కింద కంకర పోసి వదిలేశారు. దీంతో ప్రయాణం చేయాలంటే నరకంగా మారింది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా ఉన్న రోడ్లన్నింటినీ వెంటనే పూర్తి చేయాలి.

ప్రయాణం చేయాలంటే వణుకుతున్నాం..

- జల్లంపల్లి పవన్, ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు

కంకర పోసిన రోడ్లపై ప్రయాణం చేయాలంటే వెన్నులో వనుకు పుడుతుంది.నిత్యం ఆ మార్గంలో ప్రయాణం చేస్తుంటే ప్రమాదాల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నాం.స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి రోడ్ల పనులను చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

ముగిసిన బుగులోని జాతర

చివరి రోజు భారీగా తరలివచ్చిన భక్తులు

అక్షర దర్బార్, రేగొండ: శ్రీ బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ నెల 14న ఘనంగా ప్రారంభమైన బుగులోని జాతర అంగరంగ వైభవంగా జరిగింది. జాతరలో చివరి రోజు కూడా భక్తుల సందడి నెలకొంది. చివరి రోజు సతీసమేత పద్మావతి, అలివేలు మంగ వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను బుగులోని కొండపై నుండి తిరుమలగిరి గ్రామంలోని అర్చకులు కురుమాచలం వెంకటేశ్వర్ల గృహానికి రథ యాత్రలో వైభవంగా సోమవారం సాయంత్రం తీసుకువచ్చారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో జాతర చైర్మన్ రొంటాల వెంకటస్వామి, జాతర ఈవో బిల్ల శ్రీనివాస్, అర్చకులు కురుమాచలం వెంకటేశ్వర్లు,జాతర డైరెక్టర్లు,తిరుమలగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మల విజేందర్, నాయకులు గంగుల రమణా రెడ్డి, పల్నాటి శ్రీను పాల్గొన్నారు.

మహారాష్ట్ర ప్రచారంలో సోదా రామకృష్ణ

అక్షర దర్బార్, పరకాల : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సోదా రామకృష్ణ నార్త్ నాందేడ్ అసెంబ్లీ నియోజకవర్గ అబ్జర్వర్ గా వెళ్ళి నార్త్ నాందేడ్ నియోజకవర్గం లో కార్యక్రమాలలో ఆనంద్ మర్చల్ వాల్మీకి రాష్ట్ర నాయకులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అబ్దుల్ సత్తార్ తో కలసి కాంగ్రెస్ పార్టీ గెలుపు కొరకు గోకుల్ నగర్, దత్తు నగర్, వాల్మీకి నగర్ లలో పలు సమావేశాలు ఏర్పాటు చేసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్రం నుంచి వచ్చిన వాల్మీకి యూత్ ఫ్రంట్ నాయకులు అఖిల భారతీయ సఫారీ మజ్దూర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

చల్లా పరామర్శ.

అక్షర దర్బార్ సంగెం: మండలంలోని కృష్ణానగర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన మేకల దూదయ్య, దుడ్డు కొమురయ్య కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా చిత్రపటాలకు పూలమాలవేసి మాజీ ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం వారి మృతికి కల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అనువిధాల ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట పరామర్శించిన వారిలో నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, మాజి జెడ్పిటిసి గూడా సుదర్శన్ రెడ్డి, పసునూరి సారంగపాణి,మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దళారులపై చర్యలు తీసుకోవాలి

బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం కేంద్రంగా కొంతమంది దళారులు వ్యాపారుల వేషంలో అక్రమ కాంటాలు పెడుతూ, తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారని, ప్రభుత్వం స్పందించి దళారులపై చర్యలు తీసుకోవాలని బహుజన సంక్షేమ సంఘం (బిఎస్ఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు మొగ్గం సుమన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పరకాల వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్ (బుజ్జన్న)కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ దళారులు తూకంలో మోసం చేస్తున్నారని, పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాకుండా రైతులను ఆర్థికంగా నష్టపరుస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి దళారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

మాట్లాడుతున్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ

విజయోత్సవ సభకు వేళాయే..

రేపు నగరానికి సీఎం రేవంత్‌రెడ్డి

- ఆర్ట్స్ కళాశాల మైదానంలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ
- తరలిరానున్న మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు
- వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ముఖ్యమంత్రి పర్యటన
- శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలతో బిబీబిజీ..
- సీఎం పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

అక్షరదర్బార్, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేపు జిల్లాలో పర్యటించనున్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు వేడుకల్లో పాల్గొననున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్‌ను ఖరారు చేశారు. 19న మంగళవారం మధ్యాహ్నం 2:30 నిమిషాలకు కుడా గ్రౌండ్‌లోని హెలీప్యాడ్‌కు చేరుకోవడంతో సీఎం పర్యటన ప్రారంభమవుతుంది. 3:10 నిమిషాలకు బాలసముద్రం చేరుకొని కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించనున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని సందర్శిస్తారు. 3:20 నిమిషాలకు ఆర్ట్స్ కళాశాలకు రోడ్డు మార్గంలో వెళతారు. 3:50 వరకు అక్కడ ఏర్పాటుచేసిన స్వయం సహాయక మహిళా సంఘాల ఇందిర మహిళా శక్తి స్టాల్స్ సందర్శించి మహిళలతో మాట్లాడుతారు. ఆపై అక్కడ నుండి సభా వేదిక వద్దకు చేరుకుంటారు. వేదికపై సీఎస్ శాంతికుమారి స్వాగత ప్రసంగం చేస్తారు. 4 గంటల నుండి 4:20 వరకు మంత్రులు మాట్లాడతారు. 4:20 నిమిషాల నుంచి 4:30 వరకు 22 జిల్లాల్లో ఇందిర మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. 4:40 నిమిషాల నుండి 5 గంటల వరకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించనున్నారు. ప్రసంగం అనంతరం ట్రాన్స్ జెండర్ క్లినిక్‌లను ప్రారంభిస్తారు. వీటితోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన సందర్భంగా వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

సభా స్థలాన్ని పరిశీలించిన మంత్రులు..

ఇందిరా మహిళా శక్తి సభ ఏర్పాట్లను మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కొండా సురేఖ, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు, లక్ష్మణ్, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆర్ట్స్ కళాశాలలోని మైదానాన్ని పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వరంగల్ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి నిధులను కేటాయించి రేపు వరంగల్ జిల్లాకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా ప్రజల పక్షాన సీఎంకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు. సభకు మహిళలు పెద్దయెత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ మురళీధర్ రావు

వినతులు స్వీకరించిన ఎమ్మెల్సీ కొండా మురళి

- సమస్యల పరిష్కారానికి ఆదేశాలు

అక్షరదర్బార్, వరంగల్: కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు సోమవారం వరంగల్ ఓ సిటీలోని క్యాంప్ ఆఫీసులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు క్యాంప్ ఆఫీసుకు చేరుకుని తమ సమస్యలను కొండా మురళికి విన్నవించారు. వారి సమస్యలను విన్న మురళీ సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పరిష్కరించారు. ప్రజలు పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనంత త్వరగా పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని కొండా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మురళి మాట్లాడుతూ ఏ సమస్యలున్నా ప్రజలు తనను సంప్రదించవచ్చునని ప్రజలకు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం దిశగా అధికారుల నుంచి సరైన స్పందన లేనిపక్షంలో తనకు తెలియజేయాలని వారికి సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నదని వారికి భరోసానిచ్చారు.

మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

ప్రజల నుంచి ఫిర్యాదులు పునరావృతం కావొద్దు

- భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

అక్షరదర్బార్, భూపాలపల్లి: ప్రజల ఫిర్యాదులు పునరావృతం కాకుండా పనిచేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదివస్ కార్యక్రమంలో భాగంగా ఎస్పీ 15 ఫిర్యాదులు స్వీకరించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట పరిధిలోని సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని, ఫిర్యాదుదారులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. ప్రజలకు చట్టపరంగా న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

రోడ్డుపైనే మార్కెట్..!

- నిర్వీర్యమైన కూరగాయల మార్కెట్
- గిరాకి లేకుండా ఇబ్బందులు పడుతున్న వైనం
- రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ విక్రయాలు
- స్థలం లేదంటూ అధికారుల బుకాయింపు
- సెంటర్లోనే నాన్వెజ్ దుకాణాలు
- కుక్కల స్వైర విహారం
- సబ డివిజన్ కేంద్రంలో వింత ఆచారం

అక్షర దర్బార్,కాటారం : పేరుకు కాటారం సబ్ డివిజన్ కేంద్రం..జిల్లా తర్వాత జిల్లాగా విరాజిల్లుతున్న కాటారం సబ్డివిజన్ కేంద్రంలో కూరగాయలు,నాన్వెజ్ షాపులు ఎక్కడపడితే అక్కడ దుకాణాలు పెట్టుకుని సబ్డివిజన్ పేరు పరువు తీస్తున్నారు.కొందరు డబ్బున్న వ్యక్తులు తమ పలుకుబడిని ఉపయోగించుకుని ఈ అడ్డా మాదేనంటూ ఇష్టారీతిగా దుకాణాలు ఏర్పాటుచేసుకుంటుంగా కాటారం సబ్డివిజన్ ప్రజలు ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు.ప్రధానంగా ఓ వర్గానికి చెందిన వ్యక్తులు తమకిష్టమైనట్లుగా షాపులు పెట్టుని రాజ్యమేలుతుండగా పట్టించుకోవాల్సిన అధికారులు వారిచ్చే ఖాతాలకు ఫిదా అవుతున్నట్లు సమాచారం.అయితే ప్రధాన రహదారులపై పేదోళ్లు తాత్కాలికంగా దుకాణాలు పెట్టుకుంటే క్షణాల్లో ప్రత్యక్షమయ్యే సంబంధితశాఖ అధికారులు ఎంచక్కా కొందరు వ్యక్తులు ప్రధాన రహదారులని తమ అడ్డాగా పెట్టుకుని నడిపిస్తుండగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

పేరుకే కాటారం మార్కెట్ సముదాయం

ప్రతీ మేజర్ మండలకేంద్రాల్లో మార్కెట్ సదుపాయమంటూ ఉంటుండగా కాటారం సబ్డివిజన్ కేంద్రంలో అలాంటిదేం లేదనే చెప్పుకోవచ్చు.నిబంధనల ప్రకారం ఒకే చోట అన్ని రకాల కూరగాయలు,నాన్వెజ్ విక్రయాలు చేయాల్సింది ఉండగా కాటారంలో మాత్రం అలాంటి నిబంధనలు వర్తించవచ్చనే చెప్పుకోవచ్చు.కొన్నేళ్ల క్రితం తిమ్మన్నకుంట సమీపంలో మార్కెట్ కోసమని స్థలాన్ని కేటాయించగా అందులో కూరగాయల దుకాణాలు ఏర్పాటుచేసుకుని విక్రయిస్తున్నారు.కాలక్రమేణా ఏమయ్యిందోమో కానీ అందుకు విరుద్ధంగా కొందరు డబ్బున్న వ్యక్తులు షటర్లను అధిక రేట్లకు తీసుకుని కూరగాయల దుకాణాలు నడిపిస్తుండగా అధికారులు మౌనం వహిస్తున్నారు.అంతేకాకుండా నాన్వెజ్ కు సంబంధించి దుకాణాలు సైతం ఒకచోటనే ఉండాల్సింది ఉండగా ప్రధాన రహదారులను కేంద్రంగా ఏర్పాటుచేసుకుని షాపులు పెట్టుకుని కొందరు వ్యక్తులు నాన్ వెజ్ షాపుల్ని నడిపిస్తున్నారు. ఈ క్రమంలో ఆ షాపుల వద్ద కుక్కలు,పందులు స్వైర విహారం చేస్తూ వచ్చిపోయే ప్రయాణికులను ఇబ్బందులు గురిచేస్తున్నాయి.

గిరాకీ లేకుండా ఇబ్బందులు

గతం లో తిమ్మన్నకుంట సమీపంలో ఏర్పాటుచేసుకున్న కూరగాయల షాపు నిర్వాహకులు ప్రస్తుతం గిరాకి లేకుండా అల్లాడుతున్నారు.అప్పట్లో ఒకేచోట కూరగాయల దుకాణం ఉంటుందని చెప్పగా నమ్మి లక్షలతో షెడ్లు నిర్మించుకోగా మొదట్లో సజావు వానే వ్యాపారం కొనసాగింది .అయితే కొందరు వ్యక్తులు ఆ బిజినెస్లో ఆటుపోట్లని అవగతం చేసుకుని హోల్సేల్ దందాకు పేరుతో మెయిన్ సెంటర్లలోని దుకాణాలను తెరిచారు.దీంతో హోల్సేల్ వ్యాపారాన్ని ఎదర్కోలేని మార్కెట్ కాంప్లెక్స్ లోని కూరగాయ షాపుల నిరుపేద నిర్వాహకులు గిరాకిలేక పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతమనే చెప్పుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ షాపుల్లో పెట్టుకునే ఖాతాలను మరచి నిరుపేద వ్యాపారులపై దృష్టి సారించి న్యాయం చేయాలని అందరూ కోరుతున్నారు.

గ్రామ పంచాయతీ తీర్మాణం అవసరం

ఎంపీవో వీరస్వామి

కాటారం మండలకేంద్రంలో మార్కెట్ కాంప్లెక్స్ ఉండాలంటే గ్రామ పంచాయితీ తీర్మాణం అవసరముంటుంది.ప్రస్తుతం పాలకవర్గం లేకపోగా ప్రత్యేక అధికారి, పంచాయితీ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామ సభను ఏర్పాటుచేయాలి.తద్వారా గ్రామ సభ అభిప్రాయాలను తీసుకుని మార్కెట్ సముదాయాన్ని ఏర్పాటుచేయాల్సి ఉంటుంది.త్వరలో ఆ ప్రక్రియను ప్రారంభించి ఒకే చోట కూరగాయలు, నాన్ వెజ్ దుకాణాలు ఉండేలా చర్యలు తీసుకుంటాం.

'స్థానిక' రిజర్వేషన్లలో మార్పు?

- మారుతాయంటూ రాజకీయ వర్గాల్లో చర్చ
- బలం చేకూర్చుతున్న మంత్రుల వ్యాఖ్యలు
- గ్రామాల్లో జోరుగా ప్రచారం..
- కుల గణనతో మార్పు దిశగా రిజర్వేషన్లు
- పోటీ చేసేందుకు యువత ఆసక్తి
- రంగం సిద్ధం చేసుకుంటున్న యూత్ నాయకులు
- రాజకీయ రంగ ప్రవేశానికి తహతహలు

అక్షర దర్బార్, శాయంపేట : త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లు మారే అవకాశాలు మెండుగా ఉన్నాయని అధికార పార్టీ నాయకులతో పాటు ప్రతిపక్ష పార్టీ నేతలు చర్చించు కుంటున్నారు. అందుకనుణంగా ఇటీవల అధికార పార్టీ మంత్రుల వ్యాఖ్యలు సైతం ఆ ప్రచారానికి బలం చేకూర్చుతోంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిసెంబర్ నెలలో సర్పంచ్ ఎన్నికలు జరుగుతాయని వచ్చే సంక్రాంతి నాటికి కొత్త పాలక వర్గాలు కోలువుది రుతాయని తెలుపడంతో ఈ సారి యువత రాజకీయ రంగ ప్రవేశం చేసేందుకు ఉవ్విల్లూరుతున్నారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ రెండు పర్యాయలుగా కొనసాగేలా అసెంబ్లీలో తీర్మానం చేశారు. స్థానిక ఎన్నికలకు సంబంధించి ఒకదాని తరువాత మరొకటి జనవరి లోపు జరుగుతా యని సమాచారం. పార్టీ పిలుపు మేరకు వ్యయ, ప్రయ సాలకు ఓర్చి గ్రామాల్లోనే ఉంటూ పార్టీ కోసం నిరంతరం పని చేసిన నాయకులకు స్థానిక ఎన్నికల్లో టికెట్ కేటాయిస్తారా? లేక పార్టీతో సంబంధం లేక కేవలం డబ్బుకు, అవకాశం కోసం పార్టీలు మారిన వారికి అవకాశం కల్పిస్తారా..? లేక అసెంబ్లీ ఎన్నికల ముందు గండ్ర సత్తన్న గెలుపు కోసం ధైర్యంగా పోరాడిన వాళ్లకు ప్రాధాన్యమిస్తారా? అనే అంశం మండలంలో జోరుగా చర్చా సాగుతుంది..

లోకలా...?నాన్ లోకలా...?

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టణాల్లో స్థిరపడి ఉన్న వాళ్లకు టికెట్ కేటాయించడం జరిగిందని, ఎన్నికల్లో గెలవగానే పట్టణాల్లో ఉండి శాయంపేట మండల కేంద్రానికి కేవలం పనులకు మాత్రమే వచ్చి తిరిగి వెళ్ళిపోయేవారని, చుట్టం చూపుగా మాత్రమే గ్రామాల్లో పర్యటించేవాళ్ళని ప్రజలు పేర్కొం టున్నారు. ఈసారి గ్రామాల్లో ఉన్న నాయకులకు టికెట్ కేటాయిస్తరా..?లేక పట్టణాల్లో స్థిరపడి ఉన్నవాళ్లకు టికెట్ కేటాయిస్తారా? వేచిచూడాలి.

నేనే ముందున్నా.. అంటే కుదరదు

ఆదివారం జరిగిన మండల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి పార్టీ పదవుల్లో ప్రాధాన్యత ఉంటుందని, ప్రజాప్రతినిధులు, ఇతర పదవులు పొందడానికి ప్రాధాన్యత ఉంటుందని కొత్త, పాత అనే తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను కడుపులో పెట్టి చూసుకుంటానని అన్నారు. 20 ఏళ్ల నుండి నేనే ముందున్నా.. నాకే అన్ని.... అంటే కుదరదనీ.. ప్రజలలో మంచి పేరు లేకుంటే ఏ వ్యక్తికి ప్రాధాన్యత ఉండదని చెప్పారు.

బూడిద లొల్లి!

- కేటీపీపీ వద్ద బాటమ్ యాష్ తరలింపుపై వివాదం
- అసోసియేషన్ గా ఏర్పడిన లోకల్ లారీల ఓనర్లు
- వరంగల్ ప్రాంతంలోని ఇటుక బట్టీలకు బాటమ్ యాష్ రవాణా
- వరంగల్ కు చెందిన లారీల్లో బాటమ్ యాష్ లోడింగ్ కు అభ్యంతరం
- లోకల్, నాన్ లోకల్ లారీల ఓనర్ల మధ్య పంచాయతీ
- పరిష్కారానికి రంగంలోకి దిగిన రెండు జిల్లాల పోలీస్ అధికారులు

అక్షరదర్బార్, చెల్పూర్: కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ) నుంచి వెలువడుతున్న బూడిద లోడింగ్, రవాణాలో ఇటీవలి కాలంగా వివాదం చోటు చేసుకుంటుంది. ప్రధానంగా బూడిద రవాణాలో లారీల ఓనర్ల మధ్య లోకల్, నాన్ లోకల్ అనే పంచాయతీ తలెత్తుతుంది. ప్రస్తుతం ఫ్లై యాష్, బాటమ్ యాష్ లోడింగ్, రవాణాపై కొద్ది రోజుల నుంచి వివాదం నడుస్తుండటం చర్చనీయాంశమైంది. తాజాగా బాటమ్ యాష్ లోడింగ్, రవాణాపై లారీల ఓనర్ల నడుమ ఏర్పడిన లొల్లి పోలీసుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. దీంతో ఈ వివాదానికి తరలించేందుకు పోలీసులు రంగంలోకి దిగినట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే... కేటీపీపీ నుంచి వెలువడుతున్న బూడిద తరలింపునకు జెన్ కో అధికారులు టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఫ్లై యాష్, బాటమ్ యాష్ ఇలా వేరువేరుగా బూడిద తరలింపు టెండర్లను అర్హత కలిగిన ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు కేటాయిస్తుంది. ఈ టెండర్లు పొందిన కాంట్రాక్టర్లు నిబంధనల ప్రకారం కేటీపీపీ వద్దకు ఫ్లై యాష్, బాటమ్ యాష్ కోసం వచ్చే లారీల్లో లోడింగ్ చేయాల్సి ఉంది. అయితే లారీల ఓనర్లలో లోకల్, నాన్ లోకల్ అనే పంచాయతీతో లోడింగ్, రవాణాపై సమస్య ఉత్పన్నం అవుతుంది. ఈ క్రమంలో నాన్ లోకల్ అనే కారణంతో వరంగల్ నగరానికి చెందిన లారీల్లో ఇక్కడ బాటమ్ యాష్ ను లోడ్ చేయడానికి అభ్యంతరాలు వ్యక్తం అవుతుండటంతో వివాదం చివరకు పోలీసుల వద్దకు చేరింది.

- ఏం జరుగుతుందంటే..

భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ వద్ద కేటీపీపీ ఉంది. ఈ నేపథ్యంలో కేటీపీపీ వద్ద నుంచి బాటమ్ యాష్ ను వివిధ ప్రాంతాలకు రవాణా చేస్తున్న చెల్పూర్ ప్రాంతంలోని లారీల ఓనర్లు ఒక అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఈ అసోసియేషన్ లోని లారీల ఓనర్లు తాము లోకల్ అని, బాటమ్ యాష్ లోడింగ్, రవాణాలో తమకే ప్రాధాన్యం ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో వరంగల్ నగరానికి చెందిన లారీలను బాటమ్ యాష్ లోడింగ్ చేయవద్దని డిమాండ్ చేస్తున్నారని, వరంగల్ కు చెందిన లారీలకు కేటీపీపీ వద్ద బాటమ్ యాష్ లోడ్ చేయకుండా అడ్డుకుంటున్నారని ప్రచారంలో ఉంది. ఎందుకంటే వరంగల్ లో నక్కలపల్లి, ఏనుమాముల తదితర ప్రాంతాల్లో ఉన్న ఇటుక బట్టీలకు ఈ లోకల్ అసోసియేషన్ లారీల సభ్యులు తమలారీల ద్వారా బాటమ్ యాష్ రవాణా చేస్తున్నట్లు తెలిసింది. అయితే వరంగల్ కు చెందిన లారీల్లో కేటీపీపీ వద్ద బాటమ్ యాష్ లోడ్ చేస్తే తాము వరంగల్ ప్రాంతంలోని ఇటుక బట్టీలకు బాటమ్ యాష్ రవాణా చేసే అవకాశం కోల్పోతామని లోకల్ అసోసియేషన్ లోని సభ్యుల వాదనగా తెలిసింది. స్థానిక అసోసియేషన్ ఒత్తిడితోనే తమ లారీలో బాటమ్ యాష్ లోడ్ చేయడం లేదని వరంగల్ కు చెందిన లారీల ఓనర్లు పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో వరంగల్ ప్రాంతంలోని ఇటుక బట్టీలకు బాటమ్ యాష్ రవాణా కోసం వచ్చిన మూడు లారీలను రెండు రోజుల క్రితం వరంగల్ నగరంలోని ఓ పోలీస్ స్టేషన్ కు చెందిన పోలీసులు ఆపినట్లు సమాచారం. వరంగల్ కు చెందిన ఒక లారీని కేటీపీపీ వద్ద లోకల్ అసోసియేషన్ నేతలు ఆపగా, లోకల్ అసోసియేషన్ చెందిన మూడు లారీలను వరంగల్ నగరంలోని పోలీసులు ఆపి పంపడంతో లారీల ఓనర్ల మధ్య నడుస్తున్న వివాదం తెరపైకి వచ్చింది.

మానుకోటకు కేటీఆర్ !

21న జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ మహాధర్నా

హాజరుకానున్న వర్కింగ్ ప్రెసిడెంట్ !

అక్షరదర్బార్, మహబూబాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మానుకోటకు రానున్నారు. ఈనెల 21న జిల్లా కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత గులాబీ శ్రేణుల్లో తీవ్ర నైరాశ్యం అలుముకుంది. అంతేగాక.. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక పార్టీ కార్యక్రమాలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. ఈక్రమంలోనే శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు మహా ధర్నాలో పాల్గొనేందుకు కేటీఆర్ జిల్లాకు వస్తున్నట్లు సమాచారం.

ప్రశ్నిస్తే సంకెళ్లు.. నిలదీస్తే అరెస్టులు..

తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్ అరెస్టును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నిస్తే సంకెళ్లు వేయడం.. నిలదీస్తే అరెస్టు చేయడం సరికాదన్నారు. నియంత రాజ్యమది.. నిజాం రాజ్యాంగమిది.. అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపినందుకే కొణతం దిలీప్‌ను అరెస్ట్ చేశారని మండిపడ్డారు. ఎన్నాళ్లు ఈ అక్రమ అరెస్టులతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తావ్! ప్రజాస్వామ్య ప్రేమికులం.. ప్రజాస్వామ్యబద్ధంగానే ఎదుర్కొంటాం! అని తేల్చిచెప్పారు కేటీఆర్. నీ అక్రమ అరెస్టులకో.. నీ ఉడత బెదిరింపులకో.. భయపడం..! నీ అక్రమ అరెస్టులకు భయపడేవాడు ఎవరూ లేరిక్కడ అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

యోగాలో మేటి పెద్దకోడెపాక వాసి..

- గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్న తడక శంకరయ్య గౌడ్

అక్షర దర్బార్,శాయంపేట : శాయంపేట మండలం పెద్దకోడెపాక గ్రామానికి చెందిన తడక శంకరయ్య చిన్నప్పటి నుండి కరాటే, యోగా, సాంస్కృతిక కార్యక్రమాలపై మక్కువగా ఉండేవాడు. రైతు కుటుంబం నుండి కష్టపడి పోలీస్ ఉద్యోగం సాధించి పదిమందికి సేవ చేయాలనే లక్ష్యంతో తనకిష్టమైన యోగా నేర్చుకుని యోగా మాస్టర్ గా ఎదిగారు. ఆదివారం హైదరాబాదులోని అనురాగ్ యూనివర్సిటీలో నేషనల్ యోగాసనా చాంపియన్ షిప్–2024లో ఇండియన్ యోగాసనా స్పోర్ట్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ యోగధికులకు పథకాలు, ఛాంపియన్ ఆఫ్ ద ఛాంపియన్ గా తడక శంకరయ్య గౌడ్ గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. అదేవిధంగా గత నెలలో జరిగిన తెలంగాణ యోగా స్టేట్ చాంపియన్ షిప్ లో బంగారు పథకం సాధించారు. పంజాబ్, నాగపూర్ నేషనల్ పోలీస్ స్పోర్ట్స్ లో పాల్గొన్నారు. పలువురికి యోగా గురువుగా సేవలందిస్తూ గ్రామానికి పేరు తీసుకురావడంతో గ్రామస్తులు తడక శంకరయ్యను అభినందించారు.